క్లుప్తంగా

25న అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం



తిమ్మరాజుపేటలోని అయ్యప్పస్వామి ఆలయం

మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేట అయ్యప్పస్వామి ఆలయ 7వ వార్షికోత్సవాలను ఈ నెల 25న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 5 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధనకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరుతున్నారు.

తోటాడలో అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు



అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

మునగపాక : అందరి సహకారంతో తోటాడ పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు అన్నారు. తోటాడ త్రిమూర్తుల ఆలయ సమీపంలో రూ.6.50లక్షల వ్యయంతో నిర్మిస్తున్న అప్రోచ్ రోడ్డు పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అప్రోచ్ రోడ్డు ఏర్పాటు ద్వారా 10 గ్రామాల ప్రజల రాకపోకలకు అవకాశం ఉందన్నారు. ఎంపీటీసీ వెంకటలక్ష్మి ,వైఎస్సార్‌సీపీ నేతలు షేక్ ఇస్మాయిల్, దొడ్డి బాలాజీ, ఎంపీడీవో రవికుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వడదెబ్బ మృతులకు పరిహారం ఇవ్వాలి



రామయ్యపట్నంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సత్యనారాయణ

ఎస్.రాయవరం : వడగాడ్పుల కారణంగా మృతి చెందిన ఉపాధి కూలీల కుటుంబాలకు రూ.10 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ డిమాండ్ చేశారు. రామయ్యపట్నం, పెట్టుగోళ్లపల్లి గ్రామాల్లో శనివారం ఆయన ఉపాధి పనులు పరిశీలించారు. వేసవి ఎండలు తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వి మాడుగుల మండలం, ఎం.కోటపాడు గ్రామం దట్టి నూకరాజు పని ప్రదేశం వద్ద వడదెబ్బకు గురై చనిపోయాడన్నారు. ఎండలో పని చేసే వారికి వడదెబ్బ తగిలే అవకాశం ఉందని జాగ్రత్తలు తీసుకుంటూ పనులు పూర్తి చేయలన్నారు. అధికారులు విధిగా తాగునీరు, కూలీలకు నీడ సదుపాయాలు కల్పించాలన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



మృతి చెందిన విద్యార్థుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ పప్పల చలపతిరావు

మునగపాక : మండలంలోని నాగులాపల్లికి చెందిన ఇద్దరు విద్యార్థులు శారదానదిలో పడి మృతి చెందిన పొలమరశెట్టి భానుప్రకాష్, కర్రి సంపత్ కుటుంబ సభ్యులను శనివారం మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, అనకాపల్లి వర్తక సంఘ కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణ పరామర్శించారు. బాధిత తల్లిదండ్రులను ఓదార్చారు. సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉండాల్సిన విద్యార్థులు ఇలా నదిలో మునిగి మృత్యువాతకు గురికావడం బాధాకరమని సంతాపం వ్యక్తం చేశారు.



కోటవురట్లలో నమాజ్ చేస్తున్న ముస్లింలు



యలమంచిలిలో రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ గోవింద్

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

- యలమంచిలి ఈద్‌గాలో ప్రత్యేక ప్రార్థనలు

యలమంచిలి : పవిత్ర రంజాన్ పర్వదిన వేడుకలు శనివారం యలమంచిలిలో భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం 9గంటల నుంచి ఈద్‌గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రేగుపాలెం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ముస్లింలు పవిత్రంగా భావించే మాసం రంజాన్ ఈనెల రోజులు పాటు ఉపవాస దీక్షలతోపాటు ఐదు ముఖ్య విధులు నిర్వహించారు. ఐదుపూటల నమాజు చేయడం, కఠిన ఉపవాస దీక్షలు చేపట్టారు. యలమంచిలి పట్టణంలో జామియా మసీదులో పవిత్ర ఖురాన్ చదివి వినిపించారు. ముస్లిం సోదరులకు ఎంపీపీ బోదెపు గోవింద్, ప్రజాప్రతినిధులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.కె వల్లీ, పీరు, బాష, అబీబ్, జిలాని, బుఖారీ,తౌషిఫ్ అబ్దుల్లా మాస్టర్ పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : మండలంలో చెల్లాపురం సీతారాంపురం గ్రామాల్లో శనివారం రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. రంజాన్ మాసం కఠిన నిబంధనలతో ఉపవాస ఆచరించి ముస్లింలు ఒక చోట కలుసుకుని ఈద్‌ముబారక్ చెప్పుకొన్నారు. చెల్లాపురంలో ఈద్గావద్ద, సీతారాంపురంలో మసీద్ వద్ద ప్రత్యేక నమాజ్‌లు చేశారు. పట్టణ ప్రాంతాల్లో స్థిరపడిన ముస్లిం సోదరులు సహితం స్వగ్రామాలకు చేరుకుని రంజాన్ వేడుకలు జరుపుకొన్నారు.

నక్కపల్లి: రంజాన్ సందర్భంగా పెదదొడ్డిగల్లు, పెదబోదిగల్లం, చినబోదిగల్లం, రామకృష్ణాపురం, అప్పలపాయకరావుపేట తదితర గ్రామాల్లో మసీదుల వద్ద ఉదయం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మండలంలో వివిధ గ్రామాలకు చెందిన ముస్లింలు దర్గా దగ్గరకు చేరి ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ప్రత్యేకంగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసుకున్నారు.

కోటవురట్ల: స్థానిక ముస్లిం కాలనీలో మజీద్ ఉస్మాన్ ఘనీ కమిటీ ఆధ్వర్యంలో ఈద్‌గాహ్‌లో ఈద్ ఉల్ ఫితర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తి



రంజాన్ వేడుకల్లో చిన్నారులు

శ్రద్ధలతో నమాజ్ చేశారు. అనంతరం పరస్పరం ఈద్‌ముబారక్ చెబుతూ ఆలింగనాలు చేసుకున్నారు. మహిళలు ప్రత్యేకంగా నమాజ్ నిర్వహించారు. స్థానిక ముస్లిం పెద్దలు, నవజవాన్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమం అందాలంటే మళ్లీ జగనే సీఎం కావాలి



కైలాసపట్నంలో కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కె.వెంకటాపురంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు రమేష్

కోటవురట్ల: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం మండలంలో చురుగ్గా సాగుతోంది. వైఎస్సార్‌సీపీ నాయకులు తమ పరిధిలోని గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నారు. కైలాసపట్నంలో పార్టీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, సిద్ధాబత్తుల నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందుతున్నాయా..గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వ పాలన ఎలా ఉంది. సంక్షేమ పథకాలు కొనసాగించాలా అని ప్రశ్నలు వేశారు. ఇందుకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. ముఖ్యమంత్రి జగన్ మళ్లీ వస్తేనే రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందని చెబుతున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాంబాబు, చామంతుల శ్రీనివాసు పాల్గొన్నారు. కె.వెంకటాపురంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ శనివారం కార్యక్రమం నిర్వహించారు.

ఎస్.రాయవరం : మా నమ్మకం నువ్వే జగన్..జగనన్నే మా భవిష్యత్ అనే కార్యక్రమం మండలంలో 50 శాతం పూర్తయ్యిందని సచివాలయ మండల కన్వీనర్ దోసపాత్రుని సందీప్‌కుమార్ అన్నారు. ఎస్.రాయవరం మండలంలో గడిచిన 15 రోజులు క్రితం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు రామయ్యపట్నం గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ప్రారంభించి పలు గ్రామాల్లో ఎమ్మెల్యే కూడా పర్యటించి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాలు నిర్వహించారన్నారు.ఈ మేరకు గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సచివాలయ కన్వీనర్లు ,వైఎస్సార్ సీపీ నాయకులు నిత్యం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలు చురుగ్గా చేస్తున్నారన్నారు. ఏ గడపకు వెళ్లినా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సానుకూల స్పందన వస్తుందన్నారు. కార్యక్రమంలో పెనుగొల్లు పీఏసీఎస్ చైర్ పర్సన్ హనుమంతరావు, వమ్మవరం సచివాలయ కన్వీనర్ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే పోటీ పరీక్షల్లో రాణింపు

మునగపాక: విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుంటే పోటీ పరీక్షల్లో రాణించవచ్చని విశ్రాంత ఎంఈవో సూర్యారావు అన్నారు. మండలంలోని నాగులాపల్లిలో చంద్రశేఖర మహాస్వామి పిరమిడ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత పాలిసెట్ శిక్షణ తరగతులను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి,కష్టపడి చదువుకుంటే పాలిసెట్‌లో ర్యాంక్‌లు సాధించవచ్చన్నారు. సాంకేతిక విద్యను అభ్యసించడం ద్వారా ఉజ్వల భవిషత్ సొంతమవుతుందన్నారు. ధ్యానగురువు సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎర్రంశెట్టి అనిల్, శివ తదితరులు పాల్గొన్నారు.

రీ-సర్వేతో రైతులకు మేలు

మునగపాక:ప్రతి రైతు రీ-సర్వేను సద్వినియోగం చేసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. వాడ్రాపల్లిలో శనివారం ఆయన రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ-సర్వే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ భూములకు సంబంధించి సరిహద్దు విషయాల్లో రైతుల మధ్య వివాదాలు జరుగుతుండేవన్నారు. ఈ పద్ధతి ద్వారా రానున్న రోజుల్లో వివాదాలకు తావు లేకుండా ఉంటుందన్నారు. రైతులు కూడా సర్వే చేసే సిబ్బందికి సహకరించాలన్నారు. రైతులు పెతకంశెట్టి జోగినాయుడు, మళ్ల జోగినాయుడు, మళ్ల కన్నుంనాయుడు, భాస్కరరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

చివరి దశకు ఖరీఫ్ వరి నూర్పులు

రాంబిల్లి: మండలంలో ఖరీఫ్ వరి నూర్పిడి పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఖరీఫ్ వరి కోతలు అనంతరం అపరాలు సాగు చేసిన పొలాల్లో వరి నూర్పులు ఆలస్యమయ్యాయి. అపరాలు పనులు అనంతరం రైతులు వరి నూర్పులు చేస్తున్నారు. నూర్పిడి పనులకు రైతులు యంత్రాలను వినియోగిస్తున్నారు. మరోపక్క నూర్పిడి పనులు పూర్తి అయిన తర్వాత గడ్డిని రైతులు విక్రయిస్తున్నారు. మండలం నుంచి పలు ప్రాంతాలకు వరిగడ్డి ఎగుమతి అవుతుంది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాంబిల్లి: మండలంలో శనివారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గోకివాడ వద్ద విద్యుత్ తీగ తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. కొత్తూరు, మామిడివాడ, దిమిలి, కట్టుబోలు పరిసర గ్రామాలకు సాయంత్రం నుంచి రాత్రి 7.30 వరకు సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ సిబ్బంది మరమ్మతు పనులు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

చురుగ్గా మా నమ్మకం నువ్వే జగన్



మునగపాకలో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎంపీటీసీ గణేష్

మునగపాక: మండలంలోని గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు,గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వానికి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి తేడా గుర్తించాలని, వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించాలని కోరుతూ ప్రచారం చేస్తున్నారు. అలాగే 5 ప్రశ్నలతో కూడిన సమాధానాలు నమోదు చేస్తూ సర్వే చేపడుతున్నారు. మునగపాకలో ఎంపీటీసీ-3 బోడకుర్తి గణేష్ తన పరిధిలోని ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. గృహ యజమానుల అంగీకారంతో సీఎం ఫొటోతో కూడిన స్టిక్కర్లను గోడలపై అంటించి ప్రభుత్వానికి అండగా ఉంటామంటూ 8296082960 ఫోన్ నంబరుకు మిస్డ్‌కాల్స్ ఇప్పించారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు

రాంబిల్లి: మండలంలో అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా జరిగిపోతున్నాయి. రెవెన్యూ అధికారులు మండలంలో మట్టి తవ్వకాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. అయితే శనివారం మామిడివాడ, కొత్తూరు, గోకివాడ పరిధిలో పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు జరిపి తరలిస్తుండగా పలువురు ఆర్డీవో చిన్నికృష్ణ ఇతర అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. నిబంధనల ప్రకారం మట్టి తవ్వకాలు, తరలింపునకు అనుమతులు తీసుకోవాలి. అయితే అక్రమార్కులు ఎటువంటి అనుమతులు లేకుండా లేఅవుట్లు ఇతర అవసరాలకు పొక్లెయిన్‌లతో మట్టిని తవ్వి ట్రాక్టర్లతో దర్జాగా తరలించుకుపోతున్నారు. ట్రాక్టరు మట్టిని రూ.1000 నుంచి రూ.1200 ధరకు అమ్ముకుంటున్నారు. ఎస్‌ఐ దీనబంధు మట్టి తవ్వకాలపై స్పందించి విచారణ జరుపుతామన్నారు. ఆర్డీవో చిన్ని కృష్ణ మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన

పాయకరావుపేట : రాష్ట్రంలో నిరుపేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, జెడ్పీటీసీ లంక సూర్యానారాయణ, ఏఎంసీ వైస్ ఛైర్మన్ గూటూరు శ్రీనివాసరావు అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ - జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం పలు గ్రామాల్లో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణంలో రాజుగారిబీడు ఏరియాలో శనివారం ప్రచారం నిర్వహించారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెడుతున్న అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులందరికీ సక్రమంగా అందుతున్నాయా, లేదా, ప్రభుత్వ పథకాలు అమలు పై లబ్ధి దారుల అభిప్రాయాలను ప్రతి ఇంటికి తిరిగి అడిగి తెల్సుకుంటున్నారు.

అదే విధంగా సంక్షేమ పథకాలు ముద్రించిన, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఫోటోతో వున్న బ్రోచర్‌లను ప్రజలకు, లబ్ధిదారులకు పంపిణీ చేస్తూ ప్రచారం సాగిస్తున్నారు. జగన్ మోహన్‌రెడిని మళ్లీ అత్యధిక మెజార్టీతో గెలిపించినట్లయితే, యథాప్రకారం సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, సచివాలయ కన్వీనర్ సుందరావు, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

టీడీపీ బీసీలను విస్మరించిందనడం అవాస్తవం

- మాజీ మంత్రి యనమల

నక్కపల్లి: వచ్చే ఎన్నికల్లో బీసీల కోసం తెలుగుదేశం పార్టీ ప్రత్యేక మేనిఫెస్టో ప్రకటిస్తుందని మాజీ ఆర్థిక మంత్రి, టీడీపీ నేత యనమల రామకృష్ణుడు తెలిపారు. శనివారం డీఎల్‌పురంలో మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం, ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన యనమల మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బీసీల కోసం ఏర్పాటయిందని, బీసీల్లో నుంచే పుట్టుకొచ్చిందన్నారు. టీడీపీ బీసీలను విస్మరించిందని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు.

'గడప గడపలో' విశేష స్పందన



చినరామభద్రపురంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో నాయకులు

నక్కపల్లి : మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రజా మద్దతు లభిస్తోంది. శనివారం మండలంలో పలు గ్రామాల్లో ఈ కార్యక్రమం జరిగింది. దేవవరం, చినరామభద్రపురం గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు గొర్ల నర్సింహమూర్తి, సఖిరెడ్డి వెంకటరమణ, ఉప సర్పంచ్ వేగేశ్న చంటి, ఒడ్డిమెట్ట లక్ష్మిగణపతి దేవస్థానం మాజీ చైర్మన్ దండు బలరామరాజు, ఒడ్డిమెట్టలో పెట్ల పోతురాజు, పెట్ల శ్రీను, నెల్లిపూడిలో సర్పంచ్ సురేష్ వర్మ, ఎంపీటీసీ తంగెళ్ల కృష్ణ, సచివాలయ కన్వీనరు కురందాసు నాని, వేంపాడులో అయినంపూడి సురేష్‌వర్మ, శ్రీను, గునిపూడిలో శ్రీనివాసరాజు, జగన్నాథపురంలో కరణం ఈశ్వరరావు, నారపురెడ్డి కుమారి, కాకర వెంకటరావు, సీహెచ్‌ఎల్ పురంలో కర్రి రాజబాబు తదితరులు గ్రామాల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. లబ్ధిదారుల నుంచి వారు పొందిన సంక్షేమ పథకాల వివరాలను, వారి అభిప్రాయాన్ని ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేశారు. టోల్ ఫ్రీ నంబరుకు మిస్‌కాల్ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తేనే ఈ పథకాలన్ని కొనసాగుతాయని ఈ విషయాన్ని లబ్ధిదారులు గుర్తించాలన్నారు.

జగనన్న పాలనకు జేజేలు



గడపగడపకు కార్యక్రమంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి : రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. పట్టణంలో16వ వార్డు ఫైరాఫీస్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మతో కలసి శనివారం ఉదయం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో సమస్యలపై ప్రజలతో నేరుగా మాట్లాడి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నవరత్నాల్లో భాగంగా సంక్షేమ పథకాలు అందరికీ వర్తిస్తున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి పేద కుటుంబానికి ఏదో ఒక సంక్షేమ పథకం అందిందని, పారదర్శకంగా సంక్షేమ పాలన అందిస్తున్న ఘనత జగనన్నకే చెందుతుందని లబ్ధిదారులు అన్నారు. ఫైరాఫీస్ కాలనీ వాసులు తమ సమస్యలపై ఎమ్మెల్యేకు వివరించారు. పథకాలకు ఇంకా అర్హులెవరైనా ఉంటే వారిని గుర్తించిన అవసరమైన పథకాలు అందించాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లను ఆదేశించారు. నిష్పక్షపాతంగా సంక్షేమ పాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, పట్టణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపుగుప్తా, నాలుగు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

చోరీలపై అప్రమత్తతకు గ్రామాల్లో ప్రచారం



దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మైక్‌తో ప్రచారం చేస్తున్న రూరల్ పోలీసులు

యలమంచిలి : దొంగతనాలపై అప్రమత్తత కలిగి ఉండాలని రూరల్ ఎస్‌ఐ కె.సన్నిబాబు అన్నారు. ఇటీవల కాలంలో చోరీలు అధికమవడంతో శనివారం యలమంచిలి మండలంలోని పలు గ్రామాల్లో దొంగతనాలపై మైక్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో గ్రామాల్లో ప్రజలు ఆరుబయట పడుకోవడం ఆనవాయితీ అని, కానీ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో తలుపులు గడియలు వేసుకోవాలని, దూరపు ప్రయాణాలకు వెళితే స్థానిక పోలీసులకు సమాచారం అందివ్వాలని కోరారు. రాత్రిపూట గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు,అనుమానితులు,సంచరిస్తే తక్షణమే తమకు సమాచారం చేరవేయాలన్నారు. ఇంట్లోని విలువైన వస్తువులు బ్యాంకుల్లో భద్రపరచుకోవాలని, రాత్రి పూట ఒంటరిగా బయటకు వెళ్లకూడదని, యలమంచిలి రూరల్‌లో కొన్ని గ్రామాలు జాతీయ రహదారికి దగ్గరగా ఉన్నాయని, అందువల్ల రాత్రి పూట ప్రత్యేక నిఘా పెడుతున్నామని తెలిపారు. చోరీల నియంత్రణలో భాగంగా పోలీసులకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా మండలంలో అన్ని గ్రామాల్లో శనివారం ఆటోలో మైక్ ప్రచారం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

చందనోత్సవానికి సన్నాహాలు



కశింకోటలోని లక్ష్మీనృసింహస్వామి

కశింకోట : స్థానిక లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం వైశాఖ శుద్ధ తదియ పురస్కరించుకుని చందనోత్సవానికి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్టు ఆలయ అర్చకుడు అత్తిలి కోదండపాణి శనివారం తెలిపారు. చందనోత్సవం సందర్భంగా ఆ రోజు తెల్లవారుజాము 4 గంటల నుంచి చందనాన్ని శాస్త్రోక్తంగా తొలగించి స్వామి నిజరూప దర్శనాన్ని ప్రజలకు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు వేద మంత్రాల నడుమ నిజరూప స్వామికి చందనాన్ని పూసి పూజలు చేస్తామన్నారు. అనంతరం చందన రూపంలో స్వామిని భక్తులు దర్శించుకోవచ్చన్నారు.

అనకాపల్లిటౌన్ : గవరపాలెం దిబ్బవీధిలో వెలసిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారికి చందనోత్సవ కార్యక్రమం, స్వామివారి నిజరూప దర్శనం ఆదివారం నిర్వహిస్తున్నట్టు ఆలయ నిర్వాహకులు మళ్ల రామచంద్రరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం తెల్లవారు జాము 2 గంటలకు స్వామివారికి సుప్రభాత సేవ, 2.30 గంటలకు చందన వలుపు, తెల్లవారుజాము 4 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ స్వామి నిజరూప దర్శనం, సాయంత్రం 5.30 గంటలకు స్వామివారికి పంచామృత అభిషేకాలు, సహస్ర కలశాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఖాళీ కంచాలతో నిరసన



నిరసన తెలుపుతున్న ముఠా కార్మికులు

రాంబిల్లి: రసూల్ డెకర్ పరిశ్రమ వద్ద శనివారం ముఠా కార్మికులు వినూత్న నిరసన వ్యక్తం చేశారు. తమకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ ఖాళీ కంచాలతో నిరసన వ్యక్తం చేశారు. 18 రోజులుగా ధర్నా నిర్వహిస్తున్న ముఠా కార్మికులకు రసూల్ కంపెనీ యాజమాన్యం న్యాయం చేయాలని సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఆర్. రాము డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు నానాజీ, అప్పలనాయుడు పాల్గొన్నారు.